కథ

# సైకాలజీ(వి)

– రాగతి రత్నకుమారి



**సా**యంత్రం ఆఫీసు నుంచి, ఇంట్లోకి అడుగు పెడుతూనే రాఘవ, ''స్వప్నా'' అంటూ చెల్లెల్ని పిలిచాడు.

''ఏం అన్నయ్యా? ఏంటి విశేషం?'' అంటూ చేతిలో క్లాసు పుస్తకంతో ప్రత్యక్ష మైంది.

ఆ వెనుకే రాఘవ భార్య జానకి కూడా మంచినీళ్ళ గ్లాసుతో వచ్చి భర్త దగ్గర నిల బడింది.

''ఈవేళ ఆఫీసు కెళుతూ మురళీ వాళ్లింటికెళ్లాను'' అన్నాడు ఉపోద్ఘాతంగా.

''ఎవరూ? మీ స్లిప్పుల మురళీయేనా?' అని అడిగిందె స్వప్న సందేహం తీర్చు కుందామని. జానకి చిర్నవ్వుతో అన్నా చెల్లెళ్లను గమనిస్తుండిపోయింది.

''ఔను! వాడి దగ్గరే చిన్నప్పటి నుంచి ఇదిగో ఇప్పుడీ గడివయసు వచ్చే వరకూ నిరాఘాటంగా ఒకే 'నిక్‌నేమ్' సరిపోయేలా ప్రవర్తించే వాడి దగ్గరకే వెళ్లి వచ్చాను.

ఇప్పుడు వాడు స్లిప్పుల మురళిలాగా ఉన్నాడనుకున్నా వేమిటి? ఆ స్లిప్పులతో పాసైన వాడిప్పుడు మొనగాడు.

ప్రస్తుతానికి వయసును మించి ఒళ్లు, బొజ్జ అన్ని దిక్కులకు సమానంగా పెంచేసి, బేలన్స్ కుదరక హఠాత్తుగా వెనక్కో, ముందుకో పక్కలకో స్లిప్పయి ఢామ్మంటూ భూదేవిని ముద్దులాడుతుంటాడు తెలుసా.

అది సరే. మన మురళీ వాళ్లింటి తలుపు తట్టగానే ఓ అందమైన అమ్మాయి, వయస్సు పాతికుంటుం దేమో తలుపు తీసింది అన్నాడు రాఘవ.

ఈ అమ్మాయిని అంతకు ముందెప్పుడూ చూడ లేదు. మురళీ కోసం వచ్చానని అనగానే లోపలికి రమ్మ నీ, ముందు గదిలో కూర్చోబెట్టి, ఫ్యాన్ వేసి, చేతిలో పుస్తకం పెట్టి లోపలికి వెళ్లింది. ఆ మర్యాదా, మన్ననా చూసి ఎంతో సంతోషమైందనుకో.

కాసేపటికి చల్లటి షర్బత్తు గ్లాసుతో వచ్చి, నాకం దించి, చిరునవ్వుతో నా ఎదురు సోఫాలో కూర్చుని, తాను మురళి కజిన్ అని ఇంటర్వ్యూ నిమిత్తం ఈ ఊరు వచ్చినట్లు, మురళి ఆ పనిమీదే బయటకు వెళ్లా డని చెప్పిందే స్వప్నా!'' అంటూ ముగించాడు రాఘవ.

''ఆ అమ్మాయి సంస్కారానికి డంగైపోయాననుకోండి'' అన్నాడు మళ్లీ రాఘవ- స్వప్ననీ, జానకినీ చూస్తూ.

వాళ్లకి విసుగొచ్చేదాకా ఆ అమ్మాయి కబుర్లు చెబుతూనే ఉన్నాడు.

❀❀❀

రాఘవ కందగడ్డ మొహం వేసుకుని అక్కసుగా, ఆఫీసు నుంచి రాగానే చెప్పులైనా విడవకుండా, ''స్వప్నా, స్వప్నా!'' అంటూ గావుకేకల్తో చెల్లెల్ని పిలిచాడు.

''ఏంటన్నయ్యా?'' అంటూ వచ్చిన స్వప్నకేసి కోపంగా చూస్తూ, ''మీ వదినేదీ? ఇలా తగలడ మను!'' అన్నాడు చిరాగ్గా.

స్వప్న పిలవకుండానే భర్త కేకలు విన్న జానకి హడావుడిగ వంట గదిలోంచి ముందు గదిలోకి వస్తూనే ''ఏవిటండీ?'' అంది.

''ఏవిటా? నంగనాచీ, నీకసలు సిగ్గు, ఎగ్గూ ఉన్నాయా? మొగుడంటే భయం, భక్తీ ఉన్నాయా? ఈ వేళ మధ్యాహ్నం నేనూ, స్వప్నా లేనప్పుడు ఆ సుబ్బారావు గాడు మనింటికి వచ్చాడా? లేదా? చెప్పి తగలడు!'' అన్నాడు.

''వచ్చారండీ!'' అంది జానకి బిత్తరపోతూ.

''ఆ... వస్తే... నువ్వు వాణ్ణి నేను లేనని చెప్పి గుమ్మంలోంచే సాగనంపకుండా, తమరు సదరు సుబ్బిగాణ్ణి లోపలికి పిలిచి, తెగ అతిథి మర్యాదలు చేశావట. కాఫీ, టిఫిన్లతో, ఆపై కబుర్లూ కాకర కాయలతో, ఆ ఎబ్రాసి వెధవ ఆఫీసుకు వచ్చి నన్ను కలిసి నిన్ను తెగ మెచ్చుకుంటూ తెగ నీలిగాడు నా దగ్గర!'' అన్నాడు మండిపడుతూ.

జానకి నిలువెల్లా జలదరింపుతో ఆడబిడ్డ వైపు చూసింది అయోమయంగా.

స్వప్నకి లోకమంతా గిర్రున తిరుగుతున్నట్టుగా అనిపించింది. మెళకువగా వున్నప్పుడే పీడ కలలు కంటున్నట్టు, వాళ్ళన్నయ్య మొహంలోకి చూస్తూ నిలబడిపోయింది.

★